మినీ కథ



# ఎలావుంటుంది?

ఆదివారం ఉదయం తొమ్మిదిన్నర గంటలు ఎప్పుడెప్పుడవుతుందా అని ఆత్రంగా ఎదురుచూస్తూ కూర్చున్నారు బామ్మగారు. రోజు కంటె ముందుగానే లేచి స్నానం, పూజ వగైరా కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకుని మడిబట్ట అరేసుకుని వచ్చి టి.వి. ముందు కూర్చోవడం గత ఆరు ఆదివారాల నుంచీ బాగా అలవాటయింది బామ్మగారికి. టి.వి.లో వచ్చే హిందీరామాయణ కార్యక్రమం బామ్మగారి శ్రద్ధకి, ఆత్రుతకి కారణం.

రామాయణ కార్యక్రమం ప్రారంభం అయ్యే వరకు వచ్చే వివిధ ప్రకటన కార్యక్రమాలన్నింటినీ ఎప్పుడు అయిపోతాయా అన్నట్లుఅయిష్టంగాచూస్తూ కూర్చున్న బామ్మగారికి సరిగ్గా రామాయణ కార్యక్రమం ప్రారంభం అయ్యే సమయానికి కరెంట్ పోతే ఎలా వుంటుంది?

ఉక్రోషం పట్టలేని బామ్మగారు ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ మొత్తాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టడం మొదలుపెట్టారు.

"బూతు సినిమాలు, బూతుపాటలు చూపేటప్పుడు వీళ్ళకి కరెంట్ తీయాలనిపించదు. పాపం వాళ్ళూ కళ్ళల్లో ఒత్తులు వేసుకుని చూడాలిగా ఆ పాడువన్నీ. అందుకని అప్పుడు కరెంట్ తియ్యటానికి వాళ్ళకి చేతు రావు. వీళ్ళ చేతులు పడిపోను."

"ఈ రామాయణాలు, భారతాలు ఎవరిక్కావాలి. నాబోటి ముసలివచ్చినాళ్ళు చూద్దాం గదా అని కూర్చుంటే ఇదీ వరస. పిదపకాలం, పిదపబుద్ధులు ఏం చేస్తాం?" తిట్టుకుంటూనే వంటపనిలోకి వెళ్ళారు బామ్మగారు.

"ఉదయం అనగా పోయిన కరెంట్ ఇంతవరకు రాలేదు. ఆదివారం ఒక్కరోజన్నా టి.వి. ప్రోగ్రామ్స్ చూద్దాం కదా అనుకుంటే సరిగ్గా ఆదివారమే కరెంట్ తీసేస్తారు దరిద్రులు. పైగా ఈ రోజు మంచి కన్నడ సినిమా కూడా వుంది. కరెంట్ కోత ఎత్తివేశామంటూ పేపర్లో వార్తలు. వీళ్ళ వరస మాత్రం మామూలే" ఉడుక్కున్నాడు బామ్మగారి కొడుకు. వారం అంతా క్యాంపులంటూ తిరిగి ఆదివారం ఇంటికి చేరి హాయిగా టి.వి. చూద్దాం అనుకున్న అతనికి మరీ విసుగ్గా వుండక ఎలావుంటుంది?

"హేపీగా క్రికెట్ చూద్దామనుకుంటే కరెంట్ తీసేశారు గురూ. పగలంతా వీధి దీపాలు వెలగనిచ్చి రాత్రయ్యేసరికి కరెంట్ కోతంటూ దీపాలార్పే రకం ఇంతకన్నా ఏం చేస్తారు?" అక్కసు వెళ్ళబోసుకున్నాడు ఇంటికి వచ్చిన మిత్రుడితో క్రీడాభిమాని అయిన బామ్మగారి మనవడు.

ఇది ఒక్క బామ్మగారింట్లో విషయం మాత్రమే. ఆ పేటలో ఇలాంటి ఇళ్ళు ఎన్నో. ఒక్కొక్క ఇంటిలో ఎంత మంది ఫానుగాలికోసం, రేడియో పాటల కోసం, టి.వి. ప్రోగ్రామ్స్‌కోసం ఎందరెందరో ఎన్ని రకాలుగానో అక్కసు వెళ్ళబోసుకున్నారు.

ఇలా రకరకాలుగా నోటికి ఇష్టం వచ్చినట్టు తూలనాడే వాళ్ళ మాటలన్నీ ఉదయం నుంచీ మండే ఎండలో, సుత్తిదెబ్బల్ని భరిస్తూ, బరువుల్ని మోస్తూ, దీక్షగా, టౌను మొత్తానికి సంబంధించిన ఒక పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర పనిచేస్తున్న దాదాపు యెనభై, తొంభై మంది కార్మికులకు వినపడితే ఎలావుంటుంది?

— పెనుమాక నాగేశ్వరరావు

కుసుమకుమారి తీరిగ్గా ముస్తాబై వీధి అరుగు మీద కూర్చుంది సాయంత్రం ఐదు గంటలకు. వెంటనే ఎదురింటి దృశ్యం కనపడింది ఆమె కళ్ళకు. ఎదురింటి విమల తన క్లాస్‌మేట్ (అబ్బాయి)తో చదువు విషయంలో ఏదో ముచ్చటిస్తోంది. వెంటనే ఆవిషయం ప్రక్కింటి కమల చెవికి ట్రాన్స్‌ఫర్ చేసింది.

# చూపుడు వేలు

"చూశావా వదినా ఎంత కాలేజీలో చదివితే మాత్రం..." అంటూ ఉపోద్ఘాతం మొదలెట్టి ఓ అరగంటసేపు తన ప్రసంగాన్ని 'రిలే' చేసింది.

తనకు అందని ఆ సరదాకు, అవకాశానికి అసూయ చెందిందామె. కారణం తను చదివింది ఉమెన్స్ కాలేజీలో.

మర్నాడు యథాప్రకారం అదే స్థలంలో కూర్చునుంది. ప్రక్కింటి కమల వాళ్ళ మరిది సుధాకర్‌తో ఏవో కబుర్లు చెపుతోంది నవ్వుతూ. అంతే, కుసుమకుమారి రయ్యిన ఎదురింటి విమలింటికి దూసుకెళ్ళి ఆమె తల్లితో, "చూశావా పిన్నీ! ఆ కమల విరగబాటు! ఎంత మరిదైతే మాత్రం మొగుడింట్లో లేని సమయంలో..." అంటూ ఒకటికి రెండు కల్పించి మరీ తన అక్కసు తీర్చుకొంది.

ఆ సమయంలో తన మరిదితో తను కూడా అదే విధంగా ప్రవర్తిస్తానన్న విషయం గుర్తు రాలేదా గురివిందగింజకు.

ఇంకోరోజు అదే సమయం, అదే స్థలం. కుసుమకుమారి ఏవైనా దృశ్యాలు కన్పడతాయేమోనని వేటకోసం చూసే పులిలా పొంచి చూడసాగింది. ఒక పావుగంట కూర్చుని నిరుత్సాహంతో వెనుదిరగబోయి, భర్త కేకలకు గుమ్మంలోనే ఆగిపోయింది. ఎప్పుడొచ్చాడో ఏమో, భర్త మూర్తి.

"ఏమే, ఇందాకట్నించీ చూస్తున్నాను ఎదురింటి మేడమీదివాడు నీ వంకే చూస్తూ ఇకిలిస్తున్నాడు. ఎన్నాళ్ళనించీ సాగుతోందీ నాటకం?!" అంటూ నిలదీశాడు.

పాపం! కుసుమకుమారి తెరచిన నోరు అలాగే వుండిపోయింది నిమిషంపాటు!

— చంద్రకళ